# అద్భుతం ఖరీదు ఎంత?

అమ్మా, నాన్నా మాట్లాడుకోవటం ఎనిమిదేళ్ల కీర్తి విన్నది. తమ్ముడు రమేశ్‌కి బాగా జబ్బు చేసింది.

"నాల్గేళ్లకే నా కొడుక్కి నూరేళ్లు నిండుతున్నాయా? బ్రతికే మార్గమే లేదా?" అని తల్లి జానకి ఏడుస్తోంది.

"ఏం చేయను? వాడి మందులకి నా దగ్గర డబ్బు లేదు. వాణ్నిక అద్భుతం ఒక్కటే రక్షించాలి!" అన్నాడు తండ్రి శ్రీరాం నిస్పృహగా.

తన పుస్తకాల గూడు దగ్గరకి పరిగెత్తింది కీర్తి. తండ్రి అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులు దాచుకున్న మట్టి కుండ హుండీని బయటకు తీసింది. అటూ యిటూ వూపితే, హుండీ గలగల లాడింది. దొడ్లోకి వెళ్లి నెమ్మదిగా దాన్ని పగలగొట్టింది. చిందర వందరగా పడిన చిల్లర డబ్బులన్నీ పోగేసి, తన చేతి గుడ్డలో మూట కట్టింది. దొడ్డి వైపు నుంచే బజారు వైపు పరిగెత్తింది.

మందుల షాపువాడు ఏదో టెలిఫోన్‌లో పిచ్చాపాటీ మాట్లాడుతున్నాడు. వచ్చింది పేద పిల్ల—మరేం అర్జెంటు లేదన్నట్టు చూస్తూ తన పనిలో తనున్నాడు.

"అయ్యా! మా తమ్ముడికి ప్రమాదంగా ఉంది. తొందరగా మందివ్వండి" అంది కీర్తి.

షాపువాడు వినిపించుకోలేదు.

"నిజంగా మా తమ్ముడికి చాలా జబ్బుగా ఉందయ్యా! కొంచెం అద్భుతాన్నివ్వండి" అని కీర్తి ప్రాధేయపడింది.

"ఫోన్‌లో మాట్లాడుతూంటే మధ్య నీ గోల యేమిటి?" అని షాపువాడు చిరాకు పడ్డాడు.

అప్పుడే అక్కడికి వచ్చినాయన వాళ్ల మాటలు విన్నాడు. "ఏం కావాలమ్మా?" అని ఆదరంగా అడిగాడు.

"మా తమ్ముడికి చాలా ప్రమాదంగా ఉందిటండీ! ఆపరేషన్ చేయాలిట. నాన్న దగ్గర డబ్బు లేదు. అద్భుతం ఒక్కటే బతికిస్తుందిట! నా దగ్గరున్న డబ్బుతో అద్భుతాన్ని కొందామని..."

ఆ పిల్ల కళ్లల్లోని అమాయకత్వానికి అతని కళ్లు చెమర్చాయి. "నీ దగ్గర ఎంత డబ్బుందమ్మా?" అని ఆమె భుజం మీద బుజ్జగింపుగా చెయ్యి వేశాడు.

చేగుడ్డ ముడివిప్పి అక్కడ బల్ల మీద చిల్లర గుమ్మరించి గబగబా లెక్క పెట్టి "ఏడు రూపాయల డెబ్బయ్యైదు పైసలు" అంది కీర్తి.

"ఓహో! నా దగ్గరో అద్భుతం ఉంది. దాని ఖరీదు సరిగ్గా ఏడు రూపాయలు. నీ తమ్ముడికి సరిపోతుందేమో చూద్దాం! నన్ను మీ యింటికి తీసుకువెళ్లు!" అన్నాడతను—ఆమె డబ్బుల మూటని తన కోటు జేబులో పెట్టుకుంటూ.

కీర్తి ఉత్సాహంగా అతని చేయి పట్టుకుని, దగ్గరలోనే ఉన్న వాళ్లింటికి తీసుకువెళ్లింది. "ఆయన దగ్గర అద్భుతం ఉందిట!" అని తల్లిదండ్రులకి చెప్పింది.

తమ పిల్ల ఏదో చిక్కు తెచ్చి పెట్టిందని కీర్తి మీద చిరాకు పడ్డారు తల్లిదండ్రులు.

వాళ్లని వారిస్తూ, "నిజంగానే నా దగ్గర ఆ అద్భుతం ఉంది. నాతో పాటు మా హాస్పటలుకి రండి" అన్నాడు అతను.

అతనితో పాటు ఓ పెద్ద హాస్పటల్లో అడుగు పెడుతున్నప్పుడు కాని, ఆయన ప్రఖ్యాత సర్జన్ పరంధామ్ అని వాళ్లకి తెలిసిరాలేదు. వాళ్లు తమ ఆశ్చర్యం నుంచి తేరుకొనేలోగానే, ఆయన రమేశ్‌ని పరీక్షించటం—వెంటనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయటం జరిగిపోయాయి!

ఆపరేషన్ చేసి చిరునవ్వుతో బయటకు వచ్చిన డాక్టర్ పరంధామ్‌తో, "మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను బాబుగారూ!" అన్నాడు శ్రీరాం.

"డాక్టరుగారు అద్భుతం ఇచ్చారుగా! తమ్ముడికి నయమైంది" అంది కీర్తి.

"ఆపరేషన్‌కి ఎంతైందో!" అని తనలో తను గొణుక్కుంది జానకి.

"డాక్టరుగారు నాతో చెప్పారమ్మా! అద్భుతం ఖరీదు ఏడు రూపాయలట! అవును కదా డాక్టరుగారూ?" అంది కీర్తి పరంధామ్ దగ్గరకి వచ్చి.

"అవునమ్మా! మర్చేపోయాను. నా దగ్గర ఇంకా డెబ్బయ్యైదు పైసలు నీవి మిగిలాయి. ఇంద. తీసుకో!" అని ఆ పిల్ల చేతుల్లో పెట్టాడు డాక్టర్ పరంధామ్.

ఆ పిల్ల కళ్లల్లో మెరుస్తున్న అద్భుతమయిన తృప్తిని గుర్తించగలిగిన ఆ డాక్టర్ కళ్లల్లో, ఆనందబాష్పాలు చిప్పిల్లాయి!

**తటవర్తి రామచంద్రరావు**

---

# అదిరేటి డ్రస్సు మేమేస్తే...

**ఏ. రామకృష్ణప్రసాద్**

"మా చీరలు కొనండి! కేజీల కొద్దీ బంగారం గెలుచుకోండి!" టీవీలో భారీగా అడ్వర్టయిజుమెంట్లు వస్తున్నాయి.

"అమ్మా! కేజీ బంగారమంట, చీరలు కొంటావా?" డిగ్రీ చదువుతున్న పుత్రరత్నం రాజేశ్, వాళ్లమ్మని టీజ్ చేశాడు.

"ఆగరా! సీరియల్ మాంచి సస్పెన్స్‌గా ఉన్నప్పుడు 'బ్రేక్' అని ఆపు చేశాడు" అచ్చమాంబ టీవీ నుండి కన్నార్పకుండా విసుక్కుంది.

"ఔరా! ఆడవాళ్లు సహజంగా ఇష్టపడే చీరలను కూడా ఈ అరవ కన్నీటి కుటుంబకథా సీరియళ్లు డామినేట్ చేశాయి కదా!" స్వగతించుకున్నాడు అచ్చమాంబ 'బాపూ భర్త' సుబ్బారావు.

అంతలో కరెంటు పోయింది.

"హమ్మ!" వాళ్ల అమ్మ పెట్టిన సీరియల్‌ని చూడలేక అవస్థ పడుతున్న రాజేశ్ గారిగా [illegible]

సుబ్బారావు కంత ధైర్యం [illegible]కంలో తలకాయ దూర్చి ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు.

"అబ్బ! మాంచి రసపట్టులో తీసి చచ్చాడు" సుబ్బారావు వాళ్ల అమ్మగారు విసుక్కున్నారు.

అచ్చమాంబ వంటింట్లో మాగుతున్న కూరను కలపడానికి వెళ్లింది.

సడెన్‌గా రాజేశ్ "వావ్!" అని ఇంగ్లీషులో ఆశ్చర్యపోయాడు.

"ఏమిట్రా! ఆ గావుకేకలేంటి?" వాళ్ల అమ్మ విసుక్కుంది.

"హైదరాబాద్‌లో ఫ్యాషన్ షో. కత్రినాకైఫ్ వస్తుందట" కత్రినా కైఫ్ అంటేనే రాజేశ్‌కు కైపెక్కుతుంది.

"ఐతే ఏంట్రా! రోజూ మేమందరం పడుకున్న తరువాత ఎఫ్ టీవీ చూస్తూనే ఉంటావుగా! నీకు కొత్తేంటి?" ఎవరికీ వినపడకుండా సుబ్బారావు గొణుక్కున్నాడు.

"నాన్నా! నాన్నా! ఆ ఫ్యాషన్ షోలో ఉండే డ్రెస్ ఒకటి కొను

క్కుంటాను" డిమాండ్ చేస్తున్నాడో, బతిమాలుతున్నాడో తెలియకుండా అడిగాడు రాజేష్.

"వద్దురా అబ్బీ! అని టూమచ్ రిచ్ పీపుల్, టూ కాస్ట్లీ పార్టీలలో వేసుకోడానికి డిజైన్ చేసిన ఫ్యాషన్ వేర్—మనకు అటువంటి పార్టీలకు ఇన్విటేషన్ కూడా రాదు. పైగా అవేసుకుని నువ్వు కాలేజీ కెళితే కుక్కలు వెంటబడతాయి" సర్ది చెప్పబోయాడు సుబ్బారావు.

ఊఁ! హూ!. వాడు విన్లా.

అసలే కెపాసిటీ ఉండి కూడా మేనేజిమెంట్ కోటాలో ఇంజనీరింగ్ సీటిప్పించలేదని వాళ్ల నాన్న మీద గుర్రుగా ఉంది.

రిమోట్ చేతిలోకి తీసుకొని 'మ్యూట్'లో పెట్టి ఛానెల్స్ ఛేంజ్ చేయడం మొదలుపెట్టాడు. వాళ్లింట్లో 'మ్యూట్' నొక్కడం అంటే కోపమొచ్చిందని అర్థం.

"నేను ఫ్యాషనబుల్‌గా ఉంటే అమ్మాయిలు వెంటపడతారని నీ జెలసీ" ఈటె లాంటి మాట విసిరాడు.



అది విని సుబ్బారావు గిలగిలలాడాడు. "ఒరేయ్! ఒరేయ్! ఎంత మాటన్నావురా? మీ అమ్మ విన్నదంటే గ్రైండర్‌లో వేసి రుబ్బినట్లు నా బుర్రను రుబ్బేస్తుంది. సరేలే! నువ్వు నీ ఇష్టమొచ్చిన డ్రస్ కొనుక్కో" రాజీకొచ్చాడు.

పుత్రరత్నం విజయగర్వంతో మ్యూట్ ఆఫ్ చేసి వాడి రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

ఒక రోజు సాయంత్రం హఠాత్తుగా పెద్ద ప్యాక్ తీసుకొని విజిల్ వేసుకుంటూ వచ్చాడు రాజేష్.

"మమ్మీ! నేనెలాంటి డ్రస్ తెచ్చుకున్నానో చూడు" హుషారుగా వాళ్ల అమ్మను కేకేశాడు—'అదిరేటి డ్రస్సు మేమేస్తే' అని హమ్ చేస్తూ.

'హుఁ! నేనిచ్చిన డబ్బుతో కాస్ట్లీ బట్టలు కొనుక్కుని, నాకు చూపెట్టకుండా మొదలు తల్లికి చూపిస్తున్నాడు' సుబ్బారావు అలవాటుగా స్వగతించాడు.

'ఏది నాన్నా! చూడనీ!' అచ్చమాంబ అట్లకాడతో సరాసరి హాల్లోకి వచ్చింది.

'ఇదుగో! చూపెడుతున్నా! రెడీ! వన్! టూ! త్రీ!' అంటూ పాకెట్ విప్పాడు.

లోపలి డ్రెస్సు (!) చూడగానే అక్కడున్న అందరికీ కళ్లు బైర్లు కమ్మాయి. "బెదిరేటి లుక్కు మీరిస్తే-అంటే ఇదే కామోసు" సుబ్బారావు గొణిగాడు.

'ఏంటి నాన్నా! ఈ పీలికలేంటి? ఈ చమ్కీలేంటి? దీన్నింకా స్టిచింగ్ చేయించాలా?' గారాబాల కొడుకుని అంత కన్నా ఏమీ అనలేకపోయింది అచ్చమాంబ.

'లేదమ్మా! ఇదే లేటెస్ట్ ఫ్యాషన్ వేర్. ఇదెవరు డిజైన్ చేశారో తెలుసా? ఫేమస్ డిజైనర్ చాహత్' పుత్రరత్నం పూనకంలో ఉన్నాడు.

"హవ్వ! ఇటువంటి బట్టలు వేసుకుంటే నలుగురూ నవ్వి పోరూ?" రాజేష్ వాళ్ల బామ్మ ముక్కున వేలేసుకుంది.

'నవ్వేది నీలాంటి పళ్లు లేని ముసలమ్మలే బామ్మా! మా యూత్ యూతంతా ఇలాంటి ఫ్యాషన్లే ఫాలో అవుతున్నారు' రాజేష్ హితబోధ చేశాడు.

"అవును. కుక్కలు కూడా ఫాలో అవుతాయి" సుబ్బారావు తన 'స్టాన్స్' వీడలేదు.

'హు! సెంటు వాసనంటే కూడా పడని వాళ్లకి ఏం చెపుతాం!' రకీమని ఎదురిచ్చాడు పుత్రరత్నం రాజేష్.

'అబ్బ! ఉండండీ! వాడేదో ముచ్చటపడి కొనుక్కుంటే మీరు వాడి సంతోషాన్ని జావ కారుస్తారేమిటి?' అచ్చమాంబ విసుక్కుంది.

'కన్నీరు కార్చలేక!' స్వగతించాడు సుబ్బారావు.

** ** **

రాజేశ్ ఆ రాత్రంతా ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా! అని ఎదురు చూశాడు. తాను రేపు కాలేజీకి ఈ డిజైనర్ వేర్ వేసుకొని వెళితే తాను ఎన్నాళ్లుగానో లైనేస్తున్న రాధిక రియాక్షన్ ఎలా ఉంటుందో-అనుకుంటూ ఊహల్లో తేలిపోయాడు.

ఎట్టకేలకు తెల్లవారింది.

అచ్చమాంబ కొత్త బట్టలకు పసుపు రాసిచ్చింది.

'ఏంటమ్మా! లేటెస్ట్ ఫ్యాషన్ డ్రెస్‌కు కూడా ఈ ఓల్డ్ ఫ్యాషన్' అంటూ విసుక్కున్నాడు రాజేశ్.

సుబ్బారావుకి ఆఫీసులో అర్జెంటు పనుండడంతో ఆ రోజు ముందుగానే వెళ్లిపోయాడు.

సాయంత్రం గేటు తీసుకొని ఇంట్లోకి వస్తున్న సుబ్బారావుకి, వాళ్లావిడ ఏడుపు వినిపించి కంగారు పడ్డాడు.

ఇంట్లోకి వెళుతూనే—తల్లి ఒళ్లో తలపెట్టుకొని గారాబంగా పడుకున్న రాజేశ్‌నీ, వాడి జుట్టు సవరిస్తూ—'ఏం కాలేదులే నాన్నా!' అంటూ ముక్కు చీదుకుంటున్న భార్యనూ చూసి, సుబ్బారావుకి ఏమీ అర్థం కాలేదు.

రాజేశ్ ఫ్రెండ్ సురేశ్ ఓ వైపు సంతాపం పాటిస్తున్నట్లు నించుని ఉన్నాడు. సుబ్బారావుని చూడగానే 'ఇదిగో! అసలు ఈయన వల్లనే అంతా! ఆ నోరేంటో కానీ అన్నట్లే జరిగింది' అనూహ్యంగా సుబ్బారావుని ఎటాక్ చేసింది అచ్చమాంబ.

'ఏంటే? అసలేమిటిదంతా? బాబూ సురేశ్, నువ్వైనా చెప్పవయ్యా' అడిగాడు సుబ్బారావు.

'ఏం లేదంకుల్! వీడు కొత్త ఫ్యాషన్ అని డ్రెస్సు వేసుకుని వచ్చాడు కదా! వాడిని చూసి కుక్కలు వెంబడించాయి. వాడా రన్నింగ్‌లోనే రన్నింగ్ బస్ ఎక్కేశాడు. బస్సులో అంతా తలా ఓ రకంగా లుక్స్ ఇచ్చారట. కాలేజీకెళ్తే ప్రిన్సిపాల్ అందరి ముందూ క్లాసు పీకాడు. అక్కడ ఉన్న అమ్మాయిలంతా నవ్వారు. సాయంత్రం ఇంటికి వస్తుంటే వీధి చివరన క్రికెట్ ఆడుకునే స్కూలు పిల్లలు 'పిచ్చో'డంటూ గేలి చేశారు. ఇవన్నీ ఒకే రోజు జరిగేసరికి కొంచెం అప్‌సెట్ అయ్యాడంతే' వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ, విషయం వివరించాడు సురేశ్.

ఇదంతా విన్న సుబ్బారావుకు నవ్వాగలేదు. వాళ్లావిడకు ఏడుపాగలేదు.

'నేను చెప్పా కద నాన్నా! మన వేషభాషలు సమయం, సందర్భాన్ని బట్టి ఉండాలి కాని—ఏదో ఫ్యాషన్ అని గుడ్డిగా ఫాలో అయితే ఇంతే జరుగుతుంది' కొడుకు భుజం తట్టాడు.

'హుఁ!' అంటూ లేచిపోయాడు పుత్రరత్నం.

ఫ్ప్... ఏజ్ అలాంటిది' సుబ్బారావు అలవాటుగా స్వగతించాడు.

అది విన్న వాళ్ల పెంపుడు కుక్కపిల్ల ఔనంటూ 'కుయ్యి' మని తలాడించింది.